# చర్చ

వినదగునెవ్వరు చెప్పిన, సరే కానీ వినినంతనె వేగపడక వివరింప దగున్ అన్నారు మనవాళ్లు. శాస్త్రచర్చలో కూడా ప్రతిపాదన, ఖండన, పూర్వపక్షం అంటూ పద్ధతులున్నాయి. ముందుగా ఒకరొక మాట అంటారు. మరొకరెవరో దాన్ని కాదంటారు. ఊరికే కాదంటే సరిపోదు. కారణాలను చూపించాలి. దాని తర్వాత రెండు దిక్కులనుంచీ వాదాలు ప్రతివాదాలూ జరుగుతాయి. చివరకు ఇద్దరికీ అంగీకార యోగ్యమయిన సిద్ధాంతం ఒకటి తయారవుతుంది. దాన్ని ఇద్దరూ కలిసి ప్రపంచం మీదికి వదులుతారు. వినడానికిది ఎంత సులభంగా కనపడుతుందో అంత చికాకు వ్యవహారమిది. ఈ ప్రపంచంలో ఎవరికి వారు తామే సరయిన ఆలోచన చేయగలుగుతామనుకోవడంతో చిక్కు మొదలవుతుంది. తమది సరయిన అభిప్రాయం అనుకుని ఊరుకుంటే ఫరవా లేదు. ఇంకెవరి అభిప్రాయమూ సరయింది కావడానికి వీలు లేదని కూడా అనుకోవడంతో వాదం పోయి అది యుద్ధమవుతుంది. శేషం కోపేన పూరయేత్ అని ఒక చమత్కార సూత్రం ఉంది. అంటే చర్చలో మిగతా భాగం కోపంతో పూర్తి చేయవలెనని భావం. ఓపిక ఉన్నంతకాలం అవునంటే కాదంటూ చర్చ బాగానే ముందుకు సాగుతుంది. తమమీద తమకుండే అచంచలమయిన విశ్వాసం పుణ్యమా అని ఆ ఓపిక ఓ చోట చెలియలికట్ట తెగుతుంది. ఆ తర్వాత కోపం, తిట్లూ, శాపనార్థాలూ మొదలవుతాయి. చర్చ మొదటికి వస్తుంది.

రాజకీయాలలో వ్యాపారంలో చర్చలు జరుగుతుంటాయి. ఎప్పుడోగానీ ఈ చర్చలు సఫలమయినట్లు వినిపించదు. కనిపించదు. అందుకు కారణం అన్ని వర్గాలవారూ ముందే తమ నిర్ణయాలను స్థిరం చేసుకుని నామకార్థానికి చర్చలోకి దిగడం. చర్చకు కూడా రాలేదంటే చెడ్డపేరు వస్తుంది గనుక రావడం, తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లనడం, ఊగీ ఊగీ ఉయ్యాల ఉన్నచోటికే చేరడం జరుగుతుంది. దీని వల్ల కాలయాపన తప్ప మరో ఫలితం కనిపించదు. ఎప్పుడో ఒక సారి సయోధ్య కుదిరింది. సంధి జరిగింది అంటారు. తర్వాత కొంతకాలం దాకా ఎవరూ ఆ సంగతి గురించి ఆలోచించరు. సందర్భం వచ్చినపుడు చూస్తే మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంటుంది. వ్యక్తులు గానీ వర్గాలు గానీ ఎదుటి వారి ఆలోచనల గురించి కూడా సానుభూతితో ఆలోచించకపోవడమే ఇందుకు కారణం.

వాద ప్రతివాదాలు, తర్కం ఒక పద్ధతిలో జరిగితే బాగుంటుంది. మనకు ఎదురుమాట, ఎదురు ప్రశ్న ఇష్టం లేని విషయాలు. చివరకు బడిలో చెప్పిన పాఠం తలకెక్కక పోయినా ప్రశ్న అడగ వచ్చునో కూడదో తెలియని పరిస్థితి మనది. ఇలా జరగగూడదని అందరికీ

మనసులో ఉంటుంది. పిల్లి మెడలో గంట కట్టడంలాగ ఇది ఎవరు చేయాలో అసలు చెయ్యదలుచుకున్నవారు ఏం చేయాలో తెలియని సంగతి. ఈ ప్రపంచంలో ఒక విషయం లేదా ఒక సంభాషణ ముందుకు నడవాలంటే ప్రశ్న ఉండాలి. మీరు చెప్పినదానికల్లా మరొకరు గంగిరెద్దులా తల ఊపి వింటున్నారకుందాము. మీరొకరే ఎంత సేపని మాట్లాడతారు. అసలు రెండు అభిప్రాయాలు లేనిది మాట ముందుకు సాగేదెట్లా. వంకాయ వండుకుందామని ఒకరంటారు. కాదు బీరకాయయితే బాగుంటుందని మరొకరంటారు. అప్పుడు కొంచెం సేపు చర్చ జరుగుతుంది. తేల్చుకుని ఆరెంటిలో ఒకటి వండుకో వచ్చు. లేదంటే మూడో అభిప్రాయంగా గుమ్మడి కాయ వండుకోవచ్చు. పనీ జరుగుతుంది. కాసేపు సరదాగానూ ఉంటుంది. మొదటి వారు చెప్పిన దానికి రెండవవారు అనుమానం లేకుండా యస్సన్నారనుకుందాము. రోజు గడవదని కాదు గానీ కాలక్షేపం ఉండదు. సరదా అంతకన్నా ఉండదు. చర్చ కీచులాట కానంత కాలం మంచిదే. దాంట్లో నుంచి ఏదో ఒక ఫలితం వచ్చినంత కాలం మంచిదే.

బడిలో కత్తి గొప్పదా కలం గొప్పదా అంటూ ఒక చర్చా కార్యక్రమం పెడతారు. అందరూ కలం తరఫున మాట్లాడతామంటూ పేరు ఇస్తారు. పంతులు తెలివి గల ఒకరిద్దరిని ఎంచుకుని వాళ్లను కత్తి పక్షాన మాట్లాడడానికి ఒప్పిస్తాడు. విషయాన్ని అన్ని కోణాలనుంచి ఆలోచించే తీరు కూడా తెలిసి ఉండాలి మరి. కత్తి ఎందుకూ పనికిరానిదని ఎవరూ తేల్చి చెప్పలేరు. ఒక సందర్భంలో తప్పకుండా కత్తే గొప్పదవుతుంది. ఆ సందర్భం గురించి ఆలోచించకుండా కేవలం ఆదర్శాలు వల్లె వేస్తూ కూచుంటే చిక్కుల్లో పడక తప్పదు. అందుకే ప్రశ్నించ గలగాలి. వాదం వేరు. వితండవాదం వేరు. చర్చ మనిషికి కొత్త సంగతులను నేర్పిస్తుంది. కొత్త దృక్పథాలున్నాయని తెలియ జెప్పుతుంది. ఎప్పుడూ మన ఆలోచనే గొప్పది అనుకుంటాము. ఆ ఆలోచన చర్చకు వచ్చినపుడు ఆ విషయంలో ఇంకా ఎటువంటి అభిప్రాయాలున్నాయో తెలుస్తుంది. వేరే అభిప్రాయాలు ఉన్నాయని తెలిసిన తర్వాత కూడా మన అభిప్రాయాలను మనం తర్కించుకోవడానికి ముందుకు రాకపోతే ప్రయోజనం లేదు. ఒక అభిప్రాయం కానీ సిద్ధాంతం గానీ దాని చుట్టూ పుట్టుకొస్తున్న కొత్త సమాచారాన్ని, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరో సారి వశ్లేషణ జరగక పోతే ఎందుకూ పనికిరానిదిగా అయ్యే వీలుంది. చర్చ జరగాలి. అవసరమయితే సవరణలు మార్పులూ జరగాలి. కత్తి గొప్పదా కలం గొప్పదా అని రోజంతా చర్చించిన తర్వాత ఒక ఫలితం తెలిసి రెంటిలో ఏదో ఒకటే గొప్పదని తేల్చి చెప్పడానికి అవకాశం లేదని ముందునుంచి అందరికీ తెలుసు. మరిక చర్చ ఎందుకు? విషయం గురించి మరిన్ని వివరాలు తెలియడానికి. సందర్భానికి తగినట్టుగా విషయం గురించి ఆలోచించడం అలవాటు కావడానికి. కత్తి కలం పోటీ పడడం లేదు.

దేనంతటదిగా రెండూ గొప్పవేనని అర్థం చేసుకోవడానికి.

దేన్ని గురించయినా ప్రశ్న అడగవచ్చు. కానీ ప్రశ్న అడిగే ముందే జవాబు విషయంగా అభిప్రాయాలు మాత్రం ఉండకూడదు. అన్ని రకాల ప్రశ్నలకూ ఏదో ఒకరకంగా జవాబు చెప్పవచ్చు. చివరకు ఎందుకు అని ఒక ప్రశ్న మిగులుతుంది. అక్కడ ఇరుపక్షాల వారూ చిక్కులో పడిపోతారు. ఎదుటివారికి సంతృప్తి కరమయిన జవాబు ఇవ్వాలని మనసులో ఉన్నా ఏ జవాబు సంతృప్తినిస్తుందో తెలియదు. వినే వారికి కూడా తమకు కావలసిన జవాబు సాధారణంగా అందదు.కావలసిన జవాబు గురించి ముందే మనసులో ఉంటే మరింత అన్యాయంగా ఉంటుంది. ప్రశ్నలు అవును కాదని జవాబు చెప్ప వలసినవి కొన్ని. వీటికి జవాబు సులభంగానే చెప్పవచ్చు. ఇక రెండవరకం ప్రశ్నలకు వివరణలు ఇవ్వవలసి ఉంటుంది. వాటికి ఎంత చెప్పినా జవాబు కొంత తక్కువగానే కనబడుతుంది. ప్రశ్నలోంచి మరో ప్రశ్న పుట్టుకొస్తుంటాయి.

ఉద్యోగాలకూ అటువంటి ఇతర పరిస్థితులకూ జరిగే మౌఖిక పరీక్షల్లో ఇదే జరుగుతుంది. ప్రశ్నకు పొడిపొడిగా జవాబిచ్చిన వారు సులభంగా బయటపడ్డామనుకుంటారు. తెలివిగా జవాబిచ్చిన వారు మాత్రం ఒకదాని తర్వాత మరొకటిగా ప్రశ్నలను ఎదురకుంటూ చివరకు చర్చలోకి దిగి గజిబిజయిపోయి బయటకు వస్తారు. ప్రశ్నకు జవాబు ఇవ్వడం వేరు. చర్చలోకి దిగడం వేరు. చివరకు ఎక్కడో ఒక చోట నాకు తెలియదు అన్న మాట జవాబుగా వస్తే అడుగుతున్నవారికి సంతృప్తి. కానీ ఇన్ని సంగతులూ చెప్పి చివరకు తెలియదు అనవలసి వచ్చిందని జవాబులిచ్చనవారికి ఒక అసంతృప్తి. కలం కత్తి చర్చలో లాగే ఇటువంటి చర్చల్లో కూడా చివరకు తేలవలసిన ఫలితమని ఒకటి ఉండదు. ఉండకూడదు. చర్చ తరువాత వ్యక్తి యొక్క ఆలోచనల తీరు. తను నమ్మిన విషయాల గురించి వారికి ఉండే నమ్మకం మొదలయినవి బయట పడతాయి. ఫలితం వాటి మీద ఆధారపడుతుంది. గజిబిజి కాకుండా బయటపడగలగడం అవసరం. అంతే.